# 62. పండు, పండు, ఏమి పండు?

"పండు" అని పిలిచేవాళ్లు. అసలు పేరేమిటో తెలియనేలేదు, చాలారోజులు. కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీ. సాధారణంగా జాయింట్ సెక్రటరీ "పదవి"కి ఇంటర్ నుంచి రావాలి, ప్రతినిధి. కాని, అతను నిలబడిన ఏడాది, అదే, అతన్ని నిలబెట్టించడం తప్పనిసరి అయిన ఏడాది - ఇంటర్ రెండేళ్ల కుర్రాళ్లలోంచి కూడా ఎవరూ నిలబడలేదు, నిలబెట్టించబడలేదు. అతను జూనియర్ బి.ఏ. స్టూడెంట్.

"పండు" ఎప్పుడు చూసినా వెనకాల నలుగురూ పక్కని ఇద్దరూ లేకుండా కనిపించేవాడు గాదు. సెలవుల తరవాత కాలేజీ తెరిచిన సందర్భంగా జరిపే ఇనాగరల్ ఫంక్షన్, స్వాతంత్ర్య దినోత్సవం, అలా అలా పరీక్షలైపోతున్నాయనగానో లేక ఆఖరి పరీక్ష తరవాత రోజునో జరిపే ఏనివర్సరీ - అన్ని ఫంక్షన్స్‌లోనూ స్టేజి, తెరలు, మైకులు, స్టేజి మీదకు కావలసిన స్పెషల్ కుర్చీలూ, ఆడియన్సులో ముందు వరసలో వేసే కుషన్ కుర్చీలూ ఎరేంజిమెంటు చేసేవాడు. ఆహ్వాన పత్రాలూ కరపత్రాలూ అచ్చువేయించి పంచిపెట్టే పని కూడా అతనే చేపట్టేవాడు. ఫంక్షన్‌కి అన్నీ సిద్ధం అవగానే "హలో, హలో, మైక్ టెస్టింగ్, మైక్ టెస్టింగ్, వన్ - టూ - త్రి - ఫోర్ - ఫైవ్ - సిక్స్ - థాంక్యూ" - అతని గొంతు విలక్షణంగా వుండేది. ఏదైనా పాశ్చాత్య దేశంలో అయితే నీది 'బాస్ వాయిస్' అని డిక్లేర్ చేసి ఆ దేశపు సంగీతం నేర్చుకోమని ఆదేశాలిచ్చే కేసు.

"పండు" తో నేనెప్పుడూ మాట్లాడలేదు, ఆ ఏడాదంతానూ. మాట్లాడ్డం దాకా యెందుకు? దగ్గిర్నుంచి చూణ్ణయినా లేదు. అతనెప్పుడూ పక్కా రంగు గుడ్డలే వేసుకునేవాడు. చిక్కటి నీలంరంగు ఫ్యాంటులో తెల్లటి చొక్కా టకప్ చేసుకుని దానిమీద నల్లటి కోటు వేసుకునేవాడు. ఆ కోటుకి కాలర్ దగ్గిర, బుజాల మీద, బంగారపు రంగు దారంతో డిజైన్ ఉండేది. సాక్సూ బూట్లూ లేకుండా అతనెప్పుడూ కనబడనే లేదసలు.

నా రూంమేటు నరసింహం రాసిన ఇంగ్లీషు పద్యం ఆ ఏడాది కాలేజి మేగజైన్‌లో అచ్చయింది. అంతేకాక, ఆ ఏడాది మేగజైన్‌కి ప్రిన్సిపాల్‌గారే సంపాదకత్వం చేపట్టేరు; నిజంగా. (సాధారణంగా మా కాలేజీ మేగజైన్ ఎడిటర్‌గా ప్రిన్సిపాల్ గారి పేరు వేసుకున్నా ఇంగ్లీషు లెక్చరర్ గారైన వెంకటేశ్వర్లు గారో, కెమిస్ట్రీ లెక్చరర్ గారైన నీలాచలంగారో ఆ యాతన అంతా పడడం మామూలు) నరసింహం రాసిన "పోయమ్" చాలా బావుందని రిపబ్లిక్ డే సెలబ్రేషన్ సభకి ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ సంజీవిరావు గారు మెచ్చుకుని ఆ పోయమ్ రాసిన కుర్రాడికి యాభై రూపాయలు నగదు బహుమతి ప్రకటించి, రిపబ్లిక్ డే బహుమతులతో బాటుగా ఇచ్చీమని చెప్తూ పర్స్‌లోంచి యాభై రూపాయలు తీసి ప్రిన్సిపాల్ గారికి వప్పగించేరు. ప్రిన్సిపాల్‌గారు మాట్లాడుతూ నరసింహాన్ని వేదికమీదకి రమ్మన్నారు. కాని అతను ఊళ్లోలేడనీ నేనతని రూం మేటుననీ; అతను రాగానే ప్రిన్సిపాల్‌గార్ని కలవమని చెప్తాననీ మా క్లాస్ రిప్రెజెంటేటివ్ ద్వారా కబురు చేసేను.

మూడో రోజున "పండు" నాతో మాట్లాడేడు. "మిష్టర్, ఈజ్ నరసింహమ్ బ్యాక్?" (నరసింహం ఊర్నించొచ్చేడా?)

"ఒచ్చేడండి."

"లెట్ హిం సీమి టుమారో డ్యూరింగ్ ది ఆఫ్టర్ నూన్ రీసెస్. ఐ గాట్ హిజ్ అవార్డ్ మనీ అండ్ సర్టిఫికేట్" (అతన్ని రేపు మధ్యాహ్నం ఇంటర్‌వల్‌లో వొచ్చి నన్ను కలవమను....) అని చెప్పి తన బృందంతో వెళ్లిపోయాడు.

"ఆ సర్టిఫికేటూ డబ్బూ నాకు అందజెయ్యమని ప్రిన్సిపాల్‌గారు అతనికి చెప్పి ఉంటారు. అతనే మన రూమ్‌కో నా క్లాస్‌కో వచ్చి ఇచ్చుంటే బావుండేది." అన్నాడు నరసింహం.

"పోనీలెద్దూ. స్టేజీమీదికొచ్చి తీసుకోమంటే నువ్వే వెళ్లుండేవాడివి కదా" అన్నాను.

"దటీజ్ ఎంటైర్లీ ఎ డిఫరెంట్ మేటర్" (అది వేరే సంగతి) అన్నాడు నరసింహం.

పధ్నాలుగేళ్ల తరవాత ఒకనాడు నేను ఏదో పనిమీద హైదరాబాదు వెళ్లినప్పుడు ఒక లాడ్జిలో రూమ్ తీసుకుని ఉండవలిసొచ్చింది. రిసెప్షన్ డెస్క్ దగ్గిరున్న బోర్డులో రూమ్ నెంబరు 103 కోసం ఏర్పరిచిన ఎడ్రస్ స్లిట్‌లో "వి.వి.ఎల్. నరిసింహం, రాజమండ్రి" అని రాసున్న కార్డు కనబడింది. వివరాలు ఆరా తియ్యగా మా నరిసింహమే అని రూఢి అయింది. నా సామాను నాకిచ్చిన రూమ్‌లో పెట్టుకుని రూంనెంబరు 103కి వెళ్లాను. నరిసింహం టెలిఫోన్‌లో మాట్లాడుతూ నన్ను కూచోమని సంజ్ఞ చేసేడు.

"అదికాదు. నే చెప్పేది కూడా వినండి మరి." అంటున్నాడు నరిసింహం. "నేనేమో ఇక్కడి కొచ్చి మూడు రోజులు అయినప్పటికీ నా ట్రాన్స్‌ఫర్ విషయంలో అడ్డమైన చోట్లకీ తిరగడంలో ఈ వూళ్లో ఈ రెండు మూడు ఆఫీసులూ తప్ప ఇంకేం తెలియకుండానే వెళిపోతున్నాను. మీకైతే నేనున్న స్థలం తెలుసంటున్నారు. నేనైతే మీ దగ్గిరికి వెతుక్కుని రావాలి"

అవతల్నించి "ప్లీజ్. ఎలాగోలా మీరే రండి." అన్నట్టయింది.

"సరే, ఓ గంటలో వస్తాను." అని ఫోన్ పెట్టేశాడు నరిసింహం.

మామూలు పలకరింపులూ యోగక్షేమాలూ అయ్యాక నేను లేచాను. "ఎక్కడికో వస్తానని చెప్పేవు. వెళ్తావు కాబోలు. రాత్రి భోజనం మనం ఇద్దరం కలిసి చేద్దాం." అన్నాను.

"మరే, చెప్పకేం! నేనెళ్లే చోటికి నువ్వూ రావచ్చు. మన కాలేజ్‌మేట్ పాండురంగ, అదే: మనం అంతా "పండు" అనే వాళ్లం చూడు, అతను! చిక్కడపల్లిలో వాసవి లాడ్జిలో ఈ రాత్రంతా ఉంటాట్ట. అక్కడికే, నే వెడుతూంట. ఈ మధ్య నా ఇంగ్లీషు కవితల సంపుటి గురించి చదివేడుట. ఒక కాపీ తెచ్చి ఇమ్మన్నాడు. ఇద్దరం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వెళదాంపద."

"అతనిక్కడేం చేస్తున్నాడు?"

"నిన్నటిదాకా శ్రీకాకుళం డి.ఈ.ఓ. ఆఫీసులో మేనేజర్‌గా ఉండేవాడట. ఇతన్ని బాగా తెలిసిన నాయకుడు ఈ మధ్యనే విద్యామంత్రిగా చేరాడు కదా. తన ప్రయివేట్ ఆఫీసులో ఏదో పోస్టుకి ఇతన్ని లాక్కున్నాడట. నాకు రాజమండ్రి నుంచి శ్రీకాకుళం ట్రాన్స్‌ఫరైతే ఆపించుకుందామని వచ్చేను కదా. ఆ కాగితం ఏదో ఇతని కంట పడినట్టుంది. నేను వచ్చేననీ, ఫలానా చోట ఉన్నాననీ ఆరా తీసి ఫోన్‌లో పట్టుకున్నాడు!"

'ఇంకేం! "పండు" గారు ఒక్కమాట మినిస్టర్ గారితో అంటే నీ ట్రాన్స్ఫర్ ఆగిపోతుంది!' అన్నాను నేను.

నరసింహం నవ్వేడు. "ట్రాన్స్ఫర్ ఆపేస్తున్నట్టు ఈ సాయంకాలమే ఆర్డర్ పాస్ అయింది. రేపు ఫెయిర్ కాపీ తీసుకుని వెళ్లిపోడమే."

తోవలో ఒక పుస్తకాల షాపు దగ్గిర ఆటో ఆపించాడు నరిసింహం. అక్కడ యాభై రూపాయలు పెట్టి ఒక డిక్షనరీ కొన్నాడు. "ఇది కూడా అతనికే. ఈ డిక్షనరీ పదేళ్ల తరువాత ఇప్పుడే కొత్త ఎడిషన్ వచ్చింది. మాటల సందర్భంలో చెప్తే తనకొక కాపీ కొని తీసుకు రమ్మన్నాడు" అని చెప్పేడు నరసింహం. "అతనే కొనుక్కోవచ్చు కదా" అని అనబోతూ కూడా ఊరుకున్నాను.

మళ్లీ మొన్న మార్చిలో అనంతపురంలో తగిలాడు నరిసింహం. మా మేనల్లుడు కూతురికి పెళ్లి. కుటుంబంతో సహా గుంటూరు నుంచి వెళ్లాను. నరిసింహం అక్కడ కాలేజీలో పనిచేస్తున్నాడని తెలిసి అతని ఇల్లు కనుక్కొని వెళ్లాను. నన్ను సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టి అతిథి మర్యాదల కోసం లాగా లోపలికి వెళ్లిన సమయంలో అక్కడ టీపాయి మీద ఒక ఉత్తరం కనబడితే దాని మీద అడ్రస్ చూసేను. "శ్రీ పి. పాండురంగ, డి.ఇ.ఓ. కర్నూలు" అని ఉంది.

"పండు గారితో కాంటాక్ట్‌లోనే ఉన్నావన్నమాట" అన్నాను. అతను తెచ్చిన మంచినీళ్ల గ్లాసు అందుకుంటూ. "కాలేజి పరిచయమేకాక డిపార్టుమెంటు అనుబంధం కూడా ఉంది కదా, మరి" అన్నాను.

"ఈసారి ఈ అనుబంధానికి ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నాను!" అన్నాడు నరిసింహం.

"అదేం, అలాగ?"

"అదంతే. పండుగారి పద్ధతంతా చూసేక అదే చెయ్యవల్సివొచ్చింది.... నీకు చెప్పకేమీ? అతనూ మనం ఒక కాలేజీలో చదివిన నాటి నుంచీ అంతే. అతని చెయ్యే పైనుండాలన్నది అతని పద్ధతి. మేమిద్దరం ఒక వూళ్లో పని చేయవలసి ఉందనుకో. నేనే అతని దగ్గిరికి వెళ్లాలి. మేమిద్దరం కాకతాళీయంగా ఒక వూరికి క్యాంప్ వెళ్లేం అనుకో. నన్నే రమ్మని కబురు పెడతాడు. నేనున్న వూరికి అతనొస్తే నేనే అతని విడిది చేసిన స్థలానికి వెళ్లాలి. అతనున్న వూరికి నేను క్యాంప్ వెళితే కూడా నేనే అతని దగ్గిరికి వెళ్లాలి. వెళ్లినప్పుడల్లా ఏదో ఒకటి పట్టుకెళ్లి ఇవ్వవలసిందే!"

"దాంట్లో తప్పేం ఉంది? అతను మనకి సీనియరు. నీకు డిపార్ట్‌మెంటల్ ఆఫీసరు."

"అదంతా బాగానే ఉంది..." అని ఒక ఉత్తరం చూపించాడు. "నీకు పెళ్లికి ఎదిగిన కూతురు ఒకతె ఉందనీ మా అబ్బాయికి ఈడు అవుతుందనీ తెలిసింది. నువ్వు మీ ఆవిడనీ అమ్మాయినీ తీసుకుని ఓసారి కర్నూలు వస్తే మా అబ్బాయీ మేమూ మిమ్మల్ని చూసుకోవచ్చు. తరువాత మిగిలిన విషయాలు మాట్లాడుకోవచ్చు" ఈ ధోరణిలో ఉంది ఆ ఉత్తరం.

"పెళ్లి చెయ్యడం నాకు ఇదే మొదటిసారి అయినా, అమ్మాయిని చూడ్డానికి అబ్బాయి తరపున వారు రావడమే సంప్రదాయం-కనుక మీరే రావాలి-అని నిన్న ఫోన్ చేసి చెప్పేను. ఆలోచించి చెప్తానన్నాడు. నేనేమీ ఆలోచించనవసరం లేదని ఇదుగో ఈ ఉత్తరం రాసేను."

నేను నా ధోరణిలో అన్నాను. "పండులాంటి సంబంధం, జారవిడుస్తున్నావేమో?"

"లాభంలేదు. ఈ పండు మేడిపండు" అన్నాడు నరసింహం. ★